బరంపురం ప్రయాణము–అమ్మవారు పండుగలు

తాత. కృష్ణమూర్తిగారు బి. ఏ; యల్. టి.

మదిలో పుట్టెడు ఊహలకంటే
మంటల లేచెడు పొగసుడికంటే
వడివడిగా
దడదడగా

మనపొగబండీ మనరైల్ బండీ
జఫ్‌జఫ్ జజజఫ్ జజజజ జజజఫ్
పరుగిడుచున్నది పరుగిడుచున్నది
మరియొక స్టేషన్ వచ్చుచున్నది. 1.

దెబ్బలు తగిలిన దెయ్యము వలెనే
దేవత పంపిన దూతల వలెనే
తరతరగా
బిరబిరగా

చెట్లూచేమలు చెరువులు పుట్టలు
ఏళ్లూ కొండలు ఊళ్లూ పొలములు
వెనుకకు వరుసగ పరుగిడుచున్నవి
మనమిక చూడగ కనబడకున్నవి. 2.

బూచిని చూచిన పిల్లలవలెనే
ముంగిని చూచిన పాములవలెనే
తొందరగా
సందడిగా

వచ్చుచునుండెను బండీతత్తర
అగపడినంతనె ఆవులమందలు
బెదరిపోయి నలుదిక్కుల గబగబ
చెదరిపోవుచును పరుగిడుచున్నవి. 3.

మెరసిన మెరపులు కనబడునట్లే
విరిగిన కెరటము పోయినయట్లే
అదిగదిగో
ఇదిగిదిగో

అదిగో వంతెన అగపడుచున్నది
ఇదిగో వంతెన ఇక్కడనున్నది
కనబడదేమీ వచ్చిన వంతెన ?
కనబడునా మరి పోయిన వంతెన ! 4.

—గిడుగు వెంకట సీతాపతి.

నేను జబ్బుపడి లేచిన కొన్నాళ్ళకు ఒకనాడు సాయంత్రం అంగణంలో పట్టెమంచాలు వేసుకొని, అందరం కూచున్నాం. బావ కొత్తిగిలి ఒక మంచం మీద కూచుంటే, అతనికోసం తమలపాకులు చీలుతూ ఉంది అక్కయ్య. చిన్నన్న, నేను మరొక మంచం మీద కూచున్నాం. గడపలో కూమని అమ్మ కూర తరుగుతూఉంది. నాన్న అప్పుడే వీధిలోనుంచి వచ్చి, కాళ్ళు కడుగుకుందుకు నూతికి వెళ్లాడు. రాత్రికి ఫలహారంకోసం నాయనమ్మ వంటయింట్లో పొంగరాలు పోసుకుంటూఉంది.

ఆమాట, యీమాట చెప్పుకుంటూ మధ్యమధ్య నవ్వులతోను, హాస్యాలతోను, అందరం సరదాగా మాట్లాడుకుంటున్నాం.

బావ నావేపు తిరిగి, చిరునవ్వుతో, "బావా, చదువుకుందుకు పట్నంవెళ్లి ఊష్ణం తెచ్చుకున్నావటోయి?" అన్నాడు.

నిజంగా అత నా మాట హాస్యానికే అన్నాడు. కాని నాకది నొచ్చింది. చాలా చిన్నతనం వేసింది. సహజంగా కోపంకూడా వచ్చింది. కాని ఎవరి

మీదకి నాలో యేదో లోపం ఉన్నదని తలచికదా, బావ ఆమాట అన్నాడు? కోపం, అవమానం, సిగ్గు- అన్నీ ఒక్కమాటే జనించాయి నాలో.

నా ముఖవైఖరి కనిపెట్టి కాబోలు, నవ్వు సమాళించుకొని ఆయన, "బావా, మాతో బరంపురం వస్తావూ?" అన్నాడు.

నామనసు బ్రహ్మానంద పరవశం అయింది. నేనది వరలో యెన్నడూ బరంపురం చూడలేదు. అక్కయ్య అనేకమాట్లు నన్నాఊరు తీసుకొవెళతానని అనేదే కాని, యెప్పుడూ నాప్రయాణం తటస్థించలేదు.

"ఆ ఊళ్లో నన్ను స్కూల్లో ప్రవేశపెడతావా?" అని అడిగాను బావని.

నా భావం తిన్నగా గ్రహించలేక అక్కయ్య, "పోనీలే. నీకు యిష్టం లేకపోతే, బరికి వెళ్లాలని నిర్బంధం యేమీ లేదు." అన్నాది.

"అయితే నేను బరంపరం రానేరాను." అన్నాను మూతి బిగించి.

"ఏం?" అన్నాడు బావ.

"చదువుకుందుకైతేనే వస్తాను బరంపురం! స్కూల్లో నన్ను వెయ్యకపోతే, నాకేం పని మీ ఊరు రావడానికి? పర్లాకిమిడిలో అంటే, ఆ మాస్టరు చాలా చెడ్డవాడు. నిష్కారణంగా కొట్టేవాడు పిల్లల్ని. నేను తిన్న దెబ్బలు యీజన్మలో మరచిపోలేను!"

"నిన్ను కొట్టకుండా నీకు చదువు చేప్పేలాగు యేర్పాటు చేస్తే సరికద? అట్లా అయితే మాదగ్గిర ఉండి చదువుకుంటావా?" అన్నాడు బావ.

"దెబ్బలు లేకుండా అయితే, యేఊరైనా ఫరవాలేదు. అండమాన్సు ద్వీపాలకు రమ్మన్నా వస్తాను. ఎన్నాళ్ళయినా ఉండి చదువుకుంటాను." అన్నాను ఉత్సాహంతో.

ఇంతట్లో నాన్న పెరట్లోనుండి వచ్చాడు. బావ, నేను మాట్లాడుతూ ఉండడం చూసి, 'ఏమిటి కథ?' అని అడిగినట్లుగా కనుబొమలు పైకెత్తి బావవేపు చూశాడు.

"బావ మాతో బరంపురం వచ్చి, అక్కడ చదువుకుంటానని అంటున్నాడు. మీకేమీ అభ్యంతరం లేదనుకుంటాను? మాతో పంపించండి." అన్నాడు బావ.

'నిజంగా నీకు వెళ్లి చదువుకోవాలని ఉందట్రా?' అని నాన్న నావేపు తిరిగి అడిగినాడు.

"ఊఁ." అని మెల్లగా అన్నాను.

వంటింట్లోనుంచి నాయనమ్మ ఎందుకో వచ్చింది గడపలోకి. ఆమెను చూసి నాన్న, "అమ్మా, వీడు బరంపురం వెళ్లి చదువుకుంటాడట. పంపనా?" అన్నాడు.

"చదువు మిషమీద యిక్కడికి, అక్కడికి పంపకు నాయనా. కొంచెం జ్ఞానం వస్తే వాడే చదువుకుంటాడు. ఇప్పుడు మించిపోయిన దేమీ లేదు. అంతగా వాడికి చదువుమీద అభిలాష ఉంటే, యింటిపద్దనే నేర్చుకోవచ్చును. వాళ్ల అమ్మే చెప్పగలదు." అంటూ మళ్లీ లోపలికి వెళ్లిపోయింది నాయనమ్మ.

"నాన్నగారూ, వాడిని పర్లాకిమిడి పంపించడానికీ, మాఊరు పంపించడానికీ వ్యత్యాసం లేదూ? నేను పరాయిదాన్ని కాను కద? పంపించండి." అన్నాది అక్కయ్య.

"వెళ్ళడానికి వాడికి, తీసికెళ్ళడానికి మీకు ఉద్దేశం ఉన్నప్పుడు అలాగే కావచ్చును." అన్నాడు నాన్న.

మొత్తానికి నేను బరంపురం వెళ్లడం నిశ్చయం అయింది. నా సంతోషానికి అలవిలేదు. చదువుమాట తల్చుకుంటే మాత్రం అప్పుడప్పుడు గుండె ఝల్లుమనేది. 'దెబ్బలు, లేకుండా చదువుకుందువు గాని.' అని బావ చెప్పినమాటలు మళ్ళీ కొంతధైర్యం

యిస్తూ ఉండేవి. ముఖ్యంగా, నాకు బరంపురం చూడాలన్న కుతూహలం యెక్కువయింది. అది గాక, రెయిలుబండి యెక్కవచ్చును కదా అని సంబరం! వెర్రి సంతోషంతో గెంతులాడింది నా హృదయం.

రెయిలుబండీ యెక్కిన తరువాత నా గాథరా చెప్పతరం కాదు. కిటికీకి దగ్గరగా కూచున్నాను, వెనక్కి పరుగెత్తుతూఉన్న చెట్లు, చామలు చూస్తూ. బండి వడిగా పోతూఉంది. ఒక విమానంలో కూచుని, బ్రతికి ఉండగానే స్వర్గానికి వెళుతూ ఉంటే యెంత ఆనందంగా ఉంటుందో, ఆ మోస్తరుగా ఉండేను నాకప్పుడు. చెట్లు, కొండలు, యేళ్లు, ఊళ్ళు అతి త్వరగా వెనక్కి పోతున్నాయి.

బండి నడుస్తున్నంతసేపూ గాలి తీవ్రంగా వీచేది. స్టేషన్లవద్ద రెయిలు ఆగగానే జనుల హడావిడి, కోలాహలం బలే తమాషాగా ఉండేవి. వల్లూరాయన గ్రామఫోన్ పాట జ్ఞాపకంవచ్చి నాలో నేను నవ్వుకునే వాడిని. తినుబడి పదార్థాలు, పళ్ళు, కాయలు, పాలు, పెరుగు, ఖిల్లీలు, చుట్టలు, అగ్గిపెట్టెలు మొదలుగా గలవన్నీ విక్రయానికి వచ్చేవి. కొన్ని కొన్ని మిఠాయి దినుసులు బావ నన్ను కొనుక్కోనిచ్చేవాడు కాదు. కాని మొత్తం పైని బరంపురం చేరేదాకా నాదవడ గానుగవలె ఆడుతునే ఉండేది. నిజంగా రెయిలు ప్రయాణం చాలా సరదాగా ఉంటుంది-చిన్నతనంలో.

స్టేషన్లవద్ద ప్రయాణీకులు సామానులతో బండి యెక్కడానికి పడే అవస్థ చూసి తీరాలి! బండి దిగడం కూడా అట్టే సులువైన పనికాదు. బండి దిగేవాళ్లను యెక్కేవాళ్లు, యెక్కేవాళ్ళను దిగేవాళ్ళు ఒకరినొకరు ఆటంకపరచుకుంటూ, కసురుకుంటూ, తోసుకుంటారు. నాటికీ నేటికీ కూడా మూడోతరగతి బళ్ళు ఒక్కమాదిరిగానే ఉన్నాయి. ఏ పెట్టె చూసినా ప్రయాణీకులతో క్రిక్కిరిసి ఉంటుంది. నానా గోత్రస్యా, అన్ని తరహాల మనుషులూ ఆ బండ్లలోనే యెక్కుతారు. ఉక్కిరిబిక్కిరి! ఊపద్రవమైన యిరకటం! అందుకు తోడు ప్రయాణీకుల సామాన్లు కూడా అట్టివే. తట్టలు, బుట్టలు, రంగంపెట్టెలు, చీపురుకట్టలు, కుళ్లు గుడ్డలమూటలు, కూరగాయల గంపలు, ఎండుచేపల జంగెళ్ళు-కలగాపులగం! ఇక ప్రయాణీకులలో నూటికి తొంభైమంది చుట్టలు కాల్చడమో, పొగాకుకాడలు నమిలి బండిలో కూచున్నచోటనే ఉమ్మడమో, యేదో ఒక అసహ్యంపని చేస్తూఉంటారు. రాగం తాళం అసందర్భమైన తగవులు, తెలివితక్కువ చర్చలు, కాష్టవాదాలు-వీటితో కాలక్షేపం! రెయిలు ప్రయాణంచేస్తే మూడోతరగతి బండిలోనే చెయ్యాలి. రకరకాల మనుషులు, వాళ్ళవాళ్ల స్వభావాలు, మంచీ, చెడ్డ అన్నీ తెలుస్తాయి. ఉద్యోగస్తులు, అనాగరీకులు, ఆడవాళ్ళు, రోగులు, చంటిపిల్లలు, సాయిబులు, పోలీసులు, దొంగలు, బిచ్చగాళ్లు, టిక్కెట్లు లేనివాళ్ళు, బైరాగులు-అందరూ భుజం కలిసి కూచుంటారు.

ప్రయాణీకులు ఎవరేం మాట్లాడుకుంటున్నారో, యెవరేం చేస్తున్నారో, అన్నీ శ్రద్ధగా కనిపెడుతూ కూచున్నాను నేను. బ్రాహ్మలు రెయిలు బండిలో కూచుని, నానా జాతులవాళ్లు చూస్తూ ఉండగా, తగులుతూఉండగా, మైలగుడ్డలతో, చేతులైనా కడుగుకోకుండా భోజనం చెయ్యడమనేది నాకు చాలా ఆశ్చర్యం కలుగజేసింది. చోర్లంగిలో బ్రాహ్మణ వీధంట నేను మాలమాదికల నెన్నడూ చూసి యెరగను. సంతకి 'కొంగ్రాంగోలు' వెళితే, యింటికి వచ్చిన తరువాత గుడ్డలు తడుపుకొని స్నానం చేసేవాడిని. క్షవరం చేసుకుంటే నన్ను స్నానం చెయ్యకుండా యింట్లోకి రానిచ్చేవారు కారు మావాళ్ళు. చద్దన్నం తిన్నప్పుడు పొత్తిగా వంచా కట్టుకుంటే మడే కాని, తడిపి ఆరవేసిన బట్ట కట్టుకోకుంటే అన్నం పెట్టేదికాదు నాయనమ్మ! ఇక శూద్రులు, ముట్టువాళ్ళు చూస్తూ ఉండగా

భోజనం యెన్నడూ లేదు. తుదకు రొట్టెముక్క సహితం వంటింట్లోనే తినమనేవారు మావాళ్ళు. ఎంత రెయిలు ప్రయాణమైనా మడి, నిష్ఠ, ఆచారం అంటే లేకపోవచ్చును కాని, శుచి శుభ్రత అయినా లేకుంటే యెలాగు? పళ్లయినా తోముకోకుండా రెయిల్లో కూచుని కాఫీతాగడం, అడ్డమైనగడ్డీ తిని, ఆచేతులు కడుగుకోకుండా చేతి రుమాలుకు తుడిచేసుకోవడం—ఇట్లాటి అసహ్యాకరమైన పనులన్నీ తణుకూ బెణుకూ లేకుండా చెయ్యడమే నాగరికత కాబోలు!

ఆ ప్రయాణంలో తుదకు మాబావమీద కూడా నాకు కోపం వచ్చింది. స్టేషన్లవద్ద కొళాయినీళ్ళు తాగడానికే నాకు మనసు యెన్నోవిధాల కొట్లాడింది! అట్లాంటిది, ఎవడో సాయిబుచేత సోడా తెప్పించుకొని నిర్భయంగా తాగాడు బావ. 'పలాస' స్టేషన్‌లో ఎవరో గడ్డాల దొర కనిపిస్తే, అతన్ని పలకరించి, ముట్టుకొని షేక్‌హాండ్ చేశాడు.

మేం కూచున్నబండిలో కాశీకి వెళుతూవున్న విధవవాళ్ళు కొందరు ఉండిరి. విధవల్ని, అందులో ముసలివాళ్లని చూస్తే నాకొకవిధమైన భక్తి, అభిమానమున్ను. అట్టివాళ్ళను చూసినప్పుడల్లా మా నాయనమ్మ జ్ఞాపకం వచ్చేది. కాని 'నిజం నిలకడ పైని కాని తేల' దన్నట్లు, యీ బోడమ్మల గుట్టు రెయిలు ప్రయాణంలో కాని బయటికి రాదు. వీళ్ల గోవిందనామాలు, ఘుడియఘుడియ స్నానాలు ఉపవాసాలు, తులిశమ్మ ముగ్గులు, లక్షవత్తుల వ్రతాలు—అన్నీ దొంగవేషాలేమో అనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు.

ప్రయాణానికి కట్టుకున్న మూటలు విప్పి యీ విధవలందరూ తిండికి సిద్ధపడ్డారు. ఒకతె పరిపిండిలో నీళ్ళుపోసి, బెల్లం కలిపి పిసికి, ముద్దగా చలివిడి చేసింది. ఆముద్ద, అరిశెలు, అరటిపళ్ళు, జంతికలు, అటుకులు, పేలాలు, జీడిపప్పు—ఇవన్నీ తిని, పెరుగు కొనుక్కొని తాగారు. నాకు వొళ్లు ఝుల్లుమన్నది. ఏమిటీ రాక్షసితిండి! విధవవాళ్లకు కలరాభయం లేదు కాబోలు!......

రెయిలు సరదా యేమీ తీరకమునుపే బరంపురం స్టేషన్ వచ్చేసింది. ట్రెయిను ఆగగానే బంట్రోతొకడు వచ్చి, మా సామాన్లు దింపాడు.

వాడితో బావ, "అప్పడూ, బండీవచ్చిందా?" అన్నాడు.

"వొచ్చింది బాబూ."

గుర్రంబండీయెక్కి పావుగంటలో యిల్లు చేరుకున్నాం. ఇంటికీ, స్టేషనుకూ చాలా దూరం. పెద్ద పెద్ద యిళ్లు, విశాలమైన రోడ్లు, జట్కాబళ్లు, చక్కని చెరువులు, కొళాయిలు—మొత్తంపైని బరంపురం చాలా రమ్యంగా కనిపించింది.

వచ్చిన కొన్నాళ్లదాకా నాకు చదువు గొడవ లేకపోబట్టి, మనసుకు నచ్చింది తిని, తిరగడం తప్ప వేరే వ్యాపకం లేకపోయింది.

బరంపురం పెద్దబస్తీయే అయినా, పల్లెటూళ్ల సౌకర్యం అక్కడ కొంత లేకపోలేదు. పెద్దపెద్ద పట్నాలలోఉండే యిరకటం, కంపులు, దోమలు, రోగాలు, నాగరికత క్రమంగా యిప్పుడిప్పుడు ఆఊరుకు కూడా వ్యాపిస్తున్నాయి. కాని మ్యునిసిపాలిటీవారి పరిశ్రమవలన ఊరికి కొంత అందం, సౌఖ్యం, యిప్పటికైనా లేకపోలేదు. అక్కడ ఆంధ్రులు, ఓఢ్రులు, మహమ్మదీయులు, అరవవాళ్లు, అన్ని జాతులవాళ్లు ఉన్నారు.

అవతల ఒరిస్సా, యివతల ఆంధ్రదేశం కాబట్టి, బరంపురం సగం ఆంధ్రం, సగం ఓఢ్రం అనుకో వచ్చును. అక్కడ తెలుగు, ఉత్కలం రెండు భాషలూ వాడుకలోనివే. చిత్రం యేమిటంటే, ఆఊళ్లో ఆంధ్రులు ఓఢ్రం బాగా మాట్లాడగలరు—నాబోటి ఉభయభాషాప్రవీణులయితే తెలుగువాళ్లతో ఓఢ్రం, ఓఢ్రులతో తెలుగు మంచిబాగా

మాట్లాడగలరు. ఈరెండు భాషలు తెలియని పరాయి జాతివాళ్లతో అయితే, తెలుగు, ఓఢ్రం రెండూ కలగలుపుచేసి, అత్యద్భుతంగా మాట్లాడగలరు!

కాలేజి, జడ్జీకోర్టు, జిల్లా ఆసుపత్రి, కోవెలలు, మసీదులు, 'చర్చి'లు సత్రములు, ప్లీడర్లు, డాక్టర్లు, వర్తకులు, వేశ్యలు, కాఫీక్లబ్బులు, ఖిల్లీదుకాణాలు, ఊరు నిజంగా కలకలలాడుతూ ఉంటుంది. 'బరంపురం దేనికి ప్రసిద్ధి?' అని అడిగితే, కొందరు పట్టుబట్టల నేతకనీ, కొందరు ఖారామసాలాకనీ, కొందరు ఓఢ్రమంగలివాళ్లకనీ పరిపరివిధాల చెప్తారు. కాని, నిజంగా ఆఊరు అమ్మవారుసంబరాలకు ప్రసిద్ధని విశదమైంది నాకు.

దేవాంగులందరూ పూనుకొని, ఊళ్లో చందాలెత్తి, డబ్బు ధారాళంగా ఖర్చుపెట్టి, ప్రతీయేటా గొప్ప ఉత్సవం చేస్తారు. ఎక్కడెక్కడివాళ్ళూ చూడడానికి వస్తారు. ఆపదిరోజులూ ఊరు చాలా అలికిడిగా ఉంటుంది. మధ్యాహ్నం నాలుగు గంటల మొదలు రాత్రి యేడెనిమిది గంటలవరకు, 'చిన్న బజారురోడ్డు' జనంతో క్రిక్కిరిసి ఉంటుంది. అరుగులు, మేడలు, గోడలు, ఎక్కడ చూసినా జనం. రోడ్డుమీద నడవడానికి వీలుండదు. రథాలు, వాహనాలు, వేషాలు, భజనలు—అన్నీ చూడడానికి రెండు కళ్లు చాలవు. ఆటలు, పాటలు, కేకలు, ఆడవాళ్ళ కబుర్లు, చంటిపిల్లల యేడుపులు, పోలీసువాళ్ళ హడావిడి, ఆజన సమ్మర్దం, ఆకోలాహలం, ఆధూళి ఇవన్నీ చూసి, ఉత్సవంలోకి జొరపడడానికే మొదట నాకు భయం వేసింది.

బరంపురం అమ్మవారు చాలా సత్యంగల దేవతనీ, ప్రత్యక్షప్రభావం గలదనీ, చెప్పుకోగా విన్నాను. సంబరంలో ఘటంమోసే ఆమెకూడా, అమ్మవారును యేదో దగ్గిరచుట్టం వలెనే కనిపించింది! పెద్ద యెఱ్ఱని బొట్టు, పసుపుచీర, దానిమీద వసంతంమరకలు, విడిపోయి వ్రేలాడుతూ నీళ్లోడుతూఉన్న జుట్టు, నెత్తిమీద వేపకొమ్మలతోఉన్న వసంతంకుండ, చుట్టూ ధూపాలు, గుగ్గిలంపొగ, రోడ్డుధూళి, డప్పులు, బాజాలు, పోలీసు బెత్తాలు—వీటిలో వస్తూ ఉంది ఆ సాహసురాలు! వీరావేశంతో తూలిపోతూ ముందుకు నడుస్తూఉంది—పరుగెత్తుతూఉంది—మధ్యమధ్య ఆగి గిర్రున తిరుగుతూ నాట్యంఆడుతూ ఉంది. చుట్టూఉన్న స్త్రీలు ఆమెను, ఆమె తలమీది కుండను, క్రిందపడి పోనీయకుండా కాపాడుతున్నారు. 'జేయి! జగజ్జననీ! కాళీ! అంబా!' అని కేకలు. ఒకరి నొకరు తోసుకోవడం, పోలీసు బెత్తందెబ్బలు తింటూఉండడం, సంబరం వెనుక పరుగెత్తడం—ఇదీ జనుల వేడుక.

రోడ్డుమీద యీకొసనుండి ఆకొసవరకు జనమే. వేలు, లక్షలు ఉంటారు. ఏదో ఒక సదుపాయమైన చోట నిల్చుని, ఉత్సవం చూసి, చప్పున యింటికి పోదామని ఉంటుందా నాకు? ఈచివరనుండి ఆ చివరవరకు, జనాన్ని తోసుకుంటూ, తోపులు తింటూ, అన్నీ చూస్తూ తిరగాలని ముచ్చట.

మరో ముగ్గురు కుర్రవాళ్లతో జట్టుకలిపి, జేబులో ఉన్న డబ్బులన్నీ ఖర్చుపెట్టి పకాణీలు, కొబ్బరి ఉండలు, వేరుసెనగపప్పు, అన్నీకొని జేబులో పోసుకొని, వాళ్ళకు కూడా యిచ్చి, మహా ఉత్సాహంగా జొరబడ్డాను సంబరంలోకి. ఒక్కక్షణంలో ఆపాద మస్తకపర్యంతం ఒళ్ళంతా ధూళితో నిండిపోయింది. కట్టుకున్న గుడ్డలు మురికి కావడమే కాక, అక్కడక్కడ చినిగాయి. నా తెల్లని షెరాయిమీద చూసో, చూడకో, యెవడో ఖిల్లీ ఉమ్మినట్లున్నాడు. అసహ్యంగా యెఱ్ఱని మరక కట్టింది. నాతోఉన్న కుర్రవాళ్లు కేళిచేస్తూ అది చూపించిన దాకా నేను చూసుకోనేలేదు.

బట్టలు చెడితే నేం కాని, తృప్తితీరా తిరిగాను సంబరంలో. వేషాలు వేసుకుని దండుకునే వాళ్ళను చాలామందిని చూశాను. 'ఉదరనిమిత్తం బహుకృతవేషం,' అని బిచ్చ మెత్తుకుందుకు వేషాలు వేసేవాళ్లు కొందరు; మొక్కుబడులుండి విధిలేక వేషం వేసుకుని

అమ్మవారుకు సమర్పించడానికి దండుకునేవాళ్ళు కొందరు; కేవలం ముచ్చటకొద్దీ వేషాలు వేసుకొని తిరిగేవాళ్ళు కొందరు. ఎన్నెన్ని వేషాలని? 'చోడిగజా' వేషాలు, వెధవముండ వేషాలు, దొరసాని వేషాలు, మందులమారి వేషాలు, యెరుకుల వేషాలు, పులివేషాలు, ఆంజనేయ వేషాలు, ఆడ మొగవేషాలు, -ఇంకా ఎన్నో చిత్రవిచిత్రమైన వేషాలు ! వెదురు కర్రల శయనంమీద ఓగాయిత్యంగా ఒకడిని కట్టి పడుకోబెట్టి, నలుగురు మోస్తూ కొత్తకుండలో నిప్పులు, పిడకలు, మిరపకాయలు పోసి పట్టుకొని ఒకడు ముందు నడుస్తూ రొమ్ము బాదుకుంటూ లబోమని యేడ్చే వెంటవస్తూ, అడుగడుగుకీ కాన వచ్చేవి శవంవేషాలు! అందుకుతోడు ఉక్కిరిబిక్కిరిగ ఉన్న ఆజనసమూహంలో, ఆమిరపకాయ పొగలో, మధ్యమధ్య పెద్ద యెద్దుబళ్ళు. అందు, కొన్నిటిమీద వస్తాదువేషాలు,-అంటే, నలుగురైదుగురు కండ పుష్టిగలవాళ్ళు కసరత్తు సామగ్రితో వస్తాదులవలె రొమ్ములు విరుచుకొని ఠీవిగా ఆబళ్ల మీద నిల్చునేవారు. వాళ్లలో ప్రతీవాడికీ ఒంటి నిండా యెర్రమట్టి పూత, మెడలో ఆంజనేయ విగ్రహాంగల చిన్న రాగిరేకు, కాలికో, జెబ్బకో సన్నని వెండిలోడా, బిగువుగా కట్టిన కాషాయ లంగోటిన్నీ, మరికొన్ని బళ్లమీద సానివేషాలు,-అంటే, ఫిడేలు వాడొకడు, మద్దెల గాడొకడు, హార్మొనీ వాడొకడు, ఆడవేషంలోఉన్న మరో యిద్దరు ముగ్గురు యువకులు, అంతా ఒక బండిమీద ముస్తాబై నిల్చునేవారు. రంగురంగుల జరీచీరలు, వొంటినిండా మాయనగలు, కాళ్ళకు గజ్జలు, మెహానికి రంగుపౌడరు, మొలకు చేతిరుమాలు, నోట్లో ఖారాకిల్లీ, చేతికి రిస్టువాచీ, కొప్పులో పువ్వులు, ముసిముసి నవ్వులు, పాట, ఆట, అభినయం-బలే ఖుషీకరంగా ఉండేవి యీవేషాల! ఇంకా మరి కొన్ని బళ్లమీద నాటకవేషాలు-అంటే, సీతారామ లక్ష్మణులు, ద్రౌపదీ పాండవులు, చిత్రాంగీ సారంగ ధరులు, సావిత్రీ సత్యవంతులు మొదలైన వేషాలు.

నడిచే యీబళ్లే కాక, ఉత్సవంలో స్థిరంగా ఒకచోట నిలచిఉన్న ఎన్నో పెద్దపెద్ద రథాలున్నాయి. వాటిమీద చూడ సొంపయిన పెద్ద పెద్ద విగ్రహాలు. ఒక రథంమీద రాముడు విల్లెక్కుబెట్టి బాణం విడుస్తూఉన్నట్లు ప్రతిమ. దానికెదురుగా మరొక రథంమీద పదిబుర్రలతోనూ, యిరవై చేతులతోను భయంకరమైన రావణాసురుడి విగ్రహం. ఇట్టివే ఇంద్రజిత్తు లక్ష్మణుడు, సుగ్రీవుడు వాలి, కర్ణుడు అర్జునుడు, సత్యభామ నరకాసురుడు, ఒకరితో ఒకరు యుద్ధంచేస్తూఉన్నట్లు చిత్రింపబడిన విగ్రహాలు. ఈ రథాలమీది బొమ్మలు మాత్రం చాలా బాగుండేవి. అందంగా, నేర్పుగా చేసిన విగ్రహాలవి!

ఉత్సవంలో తిరుగుతూఉంటే, యింకా ఎన్నెన్ని తమాషాలో చూడవచ్చు. భజనసంఘాలు, మిఠాయి కొట్లు, ముళ్ళకంపలమీద పడుకొని ముష్టెత్తుకునే భైరాగి మహాత్ములు, పోలీసులన్నా భయములేని జేబుదొంగలు, నెత్తిని దొరటోపీలు పెట్టుకొని కొంచెం వంగి ఊగుతూ విలాసంగా నడిచే ఉన్నతోద్యోగస్తులు, ముస్తాబై మొగవాళ్ళను రాసుకుంటూ స్వేచ్ఛగా తిరిగే ఆడవాళ్ళు, వయసువచ్చిన స్కూలు విద్యార్థుల పెంకెజట్లు, మాబోటి కుర్రకుంకలు,-యింకా అనేకమైన తమాషాలు! ఒక రోజుకాదు! రెండు రోజులు కాదు; వారం పదిరోజులవరకు జరుగుతుంది, యీ అమ్మవారు పండుగ.